ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
terms and conditions apply



Registered No : APTEL/25/A0818


# ఇది కద నిజం


సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
terms and conditions apply



సోమవారం 27-07-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :39 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్


## విద్యాశాఖ పగ్గాలు ప్రహ్లాద్ జోషికి



2 లో

- ధర్మేంద్ర రాజీనామాతో కీలక మార్పు
- మోదీ సలహాతో అదనపు బాధ్యతలు
- విద్యా సంస్కరణలపై ప్రత్యేక దృష్టి
- పోటీ పరీక్షల్లో పారదర్శకత లక్ష్యం
- మూడు శాఖలతో విద్యాశాఖ పర్యవేక్షణ

## సంక్షేమ పథకాలకు ఒకే కార్డు

- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ సిద్ధం
- క్యూఆర్ కోడ్‌తో కొత్త కార్డులు
- గ్రేటర్‌లో సీఎం చేతులమీదుగా ప్రారంభం
- నకిలీ కార్డులకు చెక్ పడనుంది
- పీవీసీ కార్డులతో దీర్ఘకాల మన్నిక
- రేషన్ పంపిణీలో పూర్తి పారదర్శకత



2 లో

**న్యూస్ డెస్క్, 26 జూలై (ఇది కద నిజం ):** కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేసేందుకు తెలంగాణ సర్కార్ సిద్ధమవుతోంది. రెండు మూడు రోజుల్లో లబ్ధిదారులకు అందజేసేందుకు పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. ఆగస్టులో మూడు నెలల రేషన్?ఇస్తుండటంతో నాలుగైదు రోజుల ముందుగానే కార్డుల పంపిణీ జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్లకుపైగా కుటుంబాల కోసం క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన రేషన్ కార్డుల ముద్రణ పూర్తయినట్టు తెలుస్తోంది. ఈ కొత్త కార్డులను ఆయా జిల్లాలకు అధికార యంత్రాంగం చేరవేసింది. కార్డుల పంపిణీ తేదీని సీఎం రేవంత్ రెడ్డి ఖరారు చేయడమే తరువాయి అని అధికారులు పేర్కొన్నారు. సీఎం ఖరారు చేసిన తేదీ నుంచి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్టు పౌర సరఫరాల శాఖ వర్గాలు చెబుతున్నాయి.

గ్రేటర్‌లో శ్రీకారం..

గ్రేటర్‌నగరంలో ముందుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. అదే సమయంలో రాష్ట్రంలోని119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల చేతుల మీదుగా లబ్ధిదారులకు కొత్త కార్డులు అందజేసేలా పౌరసరఫరాల శాఖ సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసింది.

## ఎన్నికలకు శాశ్వతంగా గుడ్‌బై

- 2028 ఎన్నికలకు సిద్దరామయ్య దూరం
- ప్రజాసేవలోనే కొనసాగుతానన్న మాజీ సీఎం
- వయోభారంతో పోటీకి గుడ్‌బై
- కలుషిత రాజకీయాలపై తీవ్ర వ్యాఖ్యలు
- ఐదు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం
- రైతు కుటుంబం నుంచి ముఖ్యమంత్రి వరకు

2 లో

## షర్మిలకు సర్జరీ.. ఆరోగ్యంపై క్లారిటీ

- వైరల్ అయిన ఫొటో
- ఆరోగ్యంపై స్వయంగా స్పందన
- త్వరగా కోలుకుంటున్న షర్మిల
- ప్రార్థనలకు కృతజ్ఞతలు
- రాజకీయాలకు త్వరలో రీఎంట్రీ
- అభిమానుల్లో ఊరట



2 లో

**న్యూస్ డెస్క్, 26 జూలై (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆసుపత్రి బెడ్‌పై చికిత్స పొందుతున్న ఆమె ఫొటో ఒకటి సోషల్ మీడియా లో వైరల్ కావడంతో ఆమె ఆరోగ్య పరిస్థితిపై పార్టీ శ్రేణుల్లో, ప్రజల్లో ఆందోళన వ్యక్తమైంది. ఈ ఊహాగానాలకు తెరదించుతూ తన ఆరోగ్య పరిస్థితిపై షర్మిల స్వయంగా 'ఎక్స్' వేదికగా స్పష్టత ఇచ్చారు.

## డీఎస్సీపై రాజకీయ దుమారం

- లోకేశ్ రాజీనామాకు వైసీపీ డిమాండ్
- పోస్టుల అమ్మకాలపై సంచలన వ్యాఖ్యలు
- నీట్ తరహా అక్రమాల ఆరోపణ
- స్పోర్ట్స్ కోటాపై తీవ్ర విమర్శలు
- విద్యాశాఖపై అవినీతి ఆరోపణలు
- కలెక్టరేట్ల వద్ద ఆందోళన హెచ్చరిక

2 లో

## లీకేజీలకు ఇక బ్రేక్

- పేపర్ లీకులపై కేంద్రం ఉక్కుపాదం
- సవరణ బిల్లుకు కేంద్రం సిద్ధం
- ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు
- రెండు నెలల్లో దర్యాప్తు పూర్తి
- ముఠాలపై కఠిన శిక్షలు తప్పవు
- కోచింగ్ సెంటర్లపై భారీ జరిమానాలు
- వర్షాకాల సమావేశాల్లో కీలక బిల్లులు

2 లో



# 21కే పార్లమెంట్ దారి?

- 21 ఏళ్లకే ఎమ్మెల్యే, ఎంపీ అర్హత!
- యువతకు చట్టసభల గ్రీన్ సిగ్నల్?
- తెలంగాణ అసెంబ్లీలో త్వరలో తీర్మానం
- ఇండియా కూటమి నేతలను కలుస్తా: సీఎం
- 25 నుంచి 21కి వయోపరిమితి తగ్గింపే లక్ష్యం
- యువతకు మరిన్ని రాజకీయ అవకాశాలు
- మోడీపై రేవంత్ ఘాటు విమర్శలు
- సీఎం ప్రతిపాదనపై బీజేపీ కౌంటర్
- రఘునందన్ సవాల్.. రాజకీయ రగడ

**న్యూస్ డెస్క్, 26 జూలై (ఇది కద నిజం):** శాసనసభ, లోక్‌సభకు పోటీ చేసే కనీస వయో పరిమితిని 25 ఏళ్ల నుంచి 21కి తగ్గించే అంశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి నా శాయశక్తులా కృషి చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ మరోసారి స్పష్టం చేశారు. ఇవాళ ఓ న్యూస్ ఎజెన్సీతో మాట్లాడిన సీఎం.. 21 ఏళ్ల వయస్సులోనే యువతీ యువకులు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, సివిల్ సర్వెంట్లుగా, మేయర్లుగా, గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా కాగలుగుతున్నప్పుడు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఎందుకు అర్హులు కాకూడదన్నారు. ఓటు హక్కు వయస్సు 21 ఏళ్లుగా ఉన్నప్పుడు, శాసనసభ, లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీస వయస్సు 25 ఏళ్లుగా ఉండేదని కానీ ప్రస్తుతం ఓటు హక్కు వయస్సు 18 ఏళ్లకు తగ్గిందన్నారు. అందువల్ల ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయస్సును 25 ఏళ్ల నుండి 21 ఏళ్లకు తగ్గించాలన్నారు.

మిగతాది 2 లో..

## పేపర్ లీక్‌లపై రాజకీయ రచ్చ

- పంజాబ్ మంత్రి రాజీనామా డిమాండ్
- ఆప్ ప్రభుత్వానికి బీజేపీ ప్రశ్నలు
- నైతిక బాధ్యత ఎక్కడన్న బీజేపీ
- పలు పరీక్షల్లో లీకేజీ ఆరోపణలు
- విద్యార్థుల భవిష్యత్తుపై రాజకీయ రగడ
- కాంగ్రెస్ కూడా ఆప్‌పై ఫైర్




2 లో

**న్యూస్ డెస్క్, 26 జూలై (ఇది కద నిజం):** కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన నేపథ్యంలో.. పంజాబ్‌లో చోటు చేసుకున్నాయంటున్న ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై భారతీయ జనతా పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ ల మధ్య తీవ్ర స్థాయి రాజకీయ యుద్ధం మొదలైంది. పంజాబ్ విద్యాశాఖ మంత్రి హర్జోత్ సింగ్ బైన్స్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తుండగా, తమ ప్రభుత్వ హయాంలో ఎక్కడా పేపర్ లీకేజీలు జరగలేదని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఖండించారు. నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా ఏది?: బీజేపీ ప్రశ్నాస్త్రాలు

బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. "నైతికత గురించి మాట్లాడే కేజ్రీవాల్..

## సీఎం కుర్చీ ఊడుతుంది జాగ్రత్త!

- కాంగ్రెస్ అవినీతి చిట్టా సిద్ధం
- జంతర్ మంతర్ ఘటన ప్రస్తావన



2 లో

## ఆర్టీసీ కార్మికుల ఉద్యమం ఉధృతం నేడు రాష్ట్ర వ్యాప్తంగా....!

- ఉద్యమం ఉధృతం చేసిన జేఏసీ
- ప్రైవేటీకరణకు తీవ్ర వ్యతిరేకం
- నేడు కలెక్టర్లకు వినతులు
- ఈ-బస్సులపై అభ్యంతరం
- సీఎంకు చేరనున్న డిమాండ్లు
- జులై 30 కీలక భేటీ




2 లో

**న్యూస్ డెస్క్, 26 జూలై (ఇది కద నిజం ):** ఏపీఎస్ ఆర్టీసీ ప్రైవేటీకరించేందుకు ప్రయత్నం చేస్తున్నారంటూ ఆ సంస్థ ఉద్యోగులు, కార్మిక సంఘాల జేఏసీ నేతల చేపడుతున్న ఆందోళనలను తీవ్రతరం చేశారు. ఆర్టీసీ మనుగడను, ఉద్యోగుల భద్రతను కాపాడుకోవడమే లక్ష్యంగా నిరసనలు కొనసాగిస్తున్నారు. విద్యుత్ బస్సులనుప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా నడపడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆర్టీసీని పూర్తిగా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోపెట్టేందుకు ఆర్టీసీ ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం

## మావోయిస్టు పోస్టర్లతో కలకలం

కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న మహారాష్ట్రలోని గడ్చిరోలి ఏజెన్సీ ప్రాంతంలో మళ్లీ మావోయిస్టుల కదలికలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. జిల్లాలోని భామ్రాగడ్ తాలూకా పరిధిలోని పలు ప్రధాన రహదారులు, ప్రభుత్వ భవనాల వద్ద మావోయిస్టులు వేసిన పోస్టర్లు ప్రత్యక్షం కావడంతో స్థానిక ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.



# ఎన్నికలకు శాశ్వతంగా గుడ్‌బై



**న్యూస్ డెస్క్, 26 జూలై (ఇది కద నిజం ):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య బిగ్ షాక్ ఇచ్చారు. ఎన్నికల రాజకీయాలకు రిటైర్మెంట్ ప్రకటించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోయనని స్పష్టం చేశారు. ఈ మేరకు ఇవాళ ఎక్స్ వేదికగా ఆయన సుదీర్ఘ సందేశంతో కూడిన పోస్టు చేశారు. 'ఈ రోజుల్లో రాజకీయ రంగం కలుషితమైపోయింది. నేను 2028 విధానసభ ఎన్నికలలో పోటీ చేయడం లేదు. పోటీకి దూరంగా ఉన్నప్పటికీ క్రియాశీల రాజకీయాల్లోనే ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో వారికి తోడుగా నిలిచి.. వారి గొంతుకగా మారతాను' అని ఎక్స్ వేదికగా వెల్లడించారు.

వయోభారం..

వరుణ నియోజకవర్గం ప్రజలు మళ్లీ నన్ను ఎన్నికల్లో పోటీ చేయాలని ఒత్తిడి తెస్తున్నారని. కానీ ఇకపై ఎలాంటి ఎన్నికల్లోనూ పోటీ చేయకూడదని నేను నిశ్చయించుకున్నట్లు సిద్దరామయ్య స్పష్టం చేశారు. గతంలో నేను ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు నియోజకవర్గ ప్రజలే మాకు డబ్బులిచ్చి గెలిపించేవారు. కానీ నేడు అలాంటి పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం నాకు 79 ఏళ్లు అని మన ప్రభుత్వ పదవీకాలం ముగియడానికి ఇంకా ఏడాదిన్నర సమయం ఉంది. అప్పటికి నాకు 81-82 ఏళ్లు వస్తాయి. నా ఆరోగ్యం కూడా మునుపటిలా సహకరించడం లేదు. గతంలోలాగా అదే ఉత్సాహంతో పనిచేయడం ఇక సాధ్యం కాదన్నారు. 2028 నాటికి నా వయసు 82 ఏళ్లు, నా రాజకీయ జీవితానికి 50 ఏళ్లు పూర్తవుతాయి. 1978లో ఒక తాలూకా బోర్డు సభ్యుడిగా నా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించాను. నేను ఓటములు, గెలుపులు రెండింటినీ చూశాను. కానీ నేను నమ్మిన సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ప్రవర్తించలేదని, నా అంతరాత్మను మోసం చేయలేదని సంతృప్తి నాకు ఉందని పేర్కొన్నారు.

ఐదు దశాబ్దాలు నన్ను ఆదరించారు:

ఎన్నికల్లో పోటీ చేయాలంటే ప్రజలకే డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చిందని నేటి రాజకీయం పూర్తిగా కలుషితమైపోయాయన్నారు. నిజాయితీతో కూడిన రాజకీయాలకు నిలదొక్కుకునే అవకాశం లేకుండా పోయిందని ఈ నేపథ్యంలోనే భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయకూడదనే నిర్ణయానికి వచ్చానని పేర్కొన్నారు. ఐదు దశాబ్దాలుగా రాష్ట్ర ప్రజలు నన్ను తమలో ఒకడిగా భావించి ఆప్యాయంగా నడిపించారు. ఈ ప్రజలకు రుణపడి ఉంటానని అందుకే నా శేష జీవితం కూడా ప్రజాసేవకే అంకితం అన్నారు.

రైతు కుటుంబం నుంచి సీఎం స్థాయికి:

కర్ణాటక రాజకీయాల్లో మాస్ లీడర్ గా పేరు సంపాదించుకున్న సిద్ధరామయ్య ఓ సామాన్య రైతు కుటుంబంలో పుట్టారు. మైసూర్ సమీపంలో సిద్ధరామనహుండిలో 1948 ఆగస్టు 12న ఆయన జన్మించారు. కర్ణాటకలో అది పెద్ద సామాజిక వర్గమైన కురుబ ఓబీసీకి చెందిన ఆయన మైసూర్ లో న్యాయవాదిగా న్యాయశాస్త్ర అధ్యాపకుడిగా పని చేశారు. రైతు ఉద్యమాల్లో పాలుపంచుకుంటూ రైతు నాయకుడు నంజుండ స్వామి శిష్యుడిగా మారిపోయారు. ఆయన స్ఫూర్తితో 1978లో తాలుకా బోర్డు సబ్యుడిగా ఎన్నికై తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత 1963లో తొలిసారి చాముండేశ్వరి అసెంబ్లీ స్థానం నుంచి భారతీయ లోక్ దళ్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 2006 లో జరిగిన రాజకీయ పరిణామాలతో ఆయన్ను డీఎంకే సస్పెండ్ చేయడంతో కాంగ్రెస్ లో చేరారు. 2008 ఎన్నికల్లో గెలిచి సీఎల్పీ నేతగా ఆ తర్వాత ఎన్నికయ్యారు. 2013-2018 టర్మ్ లో, ఆ తర్వాత 2023 నుంచి ఈ ఏడాది (2026) మే వరకు కర్ణాటక ముఖ్యమంత్రిగా పని చేశారు. మే నెలలో అధిష్టానం ఆదేశాల మేరకు సీఎం పదవికి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో ప్రస్తుతం డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. అయితే సిద్ధరామయ్య ఆకస్మిక నిర్ణయం ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో సంచలనంగా మారింది.

# సీఎం కుర్చీ ఊడుతుంది జాగ్రత్త!



**న్యూస్ డెస్క్, 26 జూలై (ఇది కద నిజం ):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం తలుచుకుంటే రేవంత్ రెడ్డి ఒక్కరోజు కూడా సీఎం కుర్చీలో కూర్చోలేరని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వ రెండున్నరేళ్ల అవినీతికి సంబంధించిన పూర్తి చిట్టా తమ వద్ద ఉందని పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అసలు ఏం జరిగిందో, అక్కడి చోటుచేసుకున్న అల్లర్లకు బాధ్యులు ఎవరో దేశ ప్రజలందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అమాయక విద్యార్థులను రెచ్చగొట్టి వీధుల్లోకి తెచ్చారని ఆరోపించారు.

రాహుల్ మెప్పు కోసం కాదు.. ప్రజల కోసం పనిచేయాలి..

ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి మార్చుకోవాలని డీకే అరుణ హితవు పలికారు. రాహుల్ గాంధీ మెప్పు పొందడం కోసం పనిచేయడం వెంటనే ఆపేసి, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, వారి సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సహకారం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని, ఇకనైనా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

# సంక్షేమ పథకాలకు ఒకే కార్డు

మొదటి పేజీ తరువాయి

కొత్త రేషన్ స్మార్ట్ కార్డులు క్రెడిట్, డెబిట్ కార్డు సైజులో ఉంటాయి. ఫొటోపై కార్డు యజమాని పేరు, చిరునామాలు ఉంటాయి. సీఎం రేవంత్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలను కార్డుపై ముద్రించినట్టు అధికారులు వెల్లడించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా కొత్త రేషన్ కార్డులు ఇలా స్మార్ట్ కార్డు రూపంలో అందించనున్నారు. కార్డుపై క్యూఆర్ కోడ్ ప్రింటింగ్ చేసి ఉంటుంది. ఆ కోడ్‌ను స్కాన్ చేస్తే రేషన్ లబ్ధిదారులైన ఆ కుటుంబ సభ్యుల వివరాలతో పాటు ఇప్పటి వరకు బియ్యం, చక్కెర, గోధుమలు వంటి రేషన్ వస్తువుల్ని తీసుకున్న పూర్తి వివరాలు కనిపిస్తాయి.

నకిలీలకు ముకుతాడు..

పౌరసరఫరాలశాఖకు అందించే కొత్త స్మార్ట్ కార్డులపై క్యూఆర్ కోడ్ ఉండడంతో నకిలీ కార్డుల జారీకి అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. ఈ- స్మార్ట్ కార్డులను పీవీసీ మెటీరియల్‌తో తయారు చేస్తారు. ఇది సాధారణ కాగితపు లేదా లామినేషన్ కార్డుల కంటే ఎక్కువ కాలం మన్నికగా ఉంటా యి. కార్డులోని వివరాలను అధికారులు సులభంగా ధ్రువీకరించే అవకాశం ఉన్నది. భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానం చేయడానికి ఈ- స్మార్ట్ కార్డులు ఎంతో ఉపయోగపడతాయి. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో వివరాలు తప్పుగా నమోదు కావడంతో కొంత మంది లబ్ధిదారులకు రేషన్ సరకుల పంపిణీలో అవకతవకలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. స్మార్ట్ కార్డులతో ఇలాంటి పరిస్థితి ఉండదని అధికారులు చెబుతున్నారు. ఒకే కుటుంబానికి ఒకే కార్డు ఉండడంతోపాటు తప్పుడు వివరాలతో ప్రయోజనం పొందే అవకాశం ఉండదు. క్యూఆర్ కోడ్ ఆధారంగా ధ్రువీకరణ సులువు కావడంతో పాటు రేషన్ పంపిణీలో పారదర్శకత ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. సాంకేతిక పరి జ్ఞానంతో నాణ్యమైన సేవలు అందించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

స్మార్ట్ కార్డుల ప్రయోజనాలు..

స్మార్ట్ రేషన్ కార్డు కేవలం సన్నబియ్యం పంపిణీకే కాకుండా భవిష్యత్తులో వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అమలు చేయనున్నట్టు తెలుస్తోంది. కుటుంబ వివరాల ధ్రువీకరణ, ప్రభుత్వ సేవల వినియోగం, లబ్ధిదారుల గుర్తింపు వంటి అవసరాలకు ఈ- కార్డులు ఉపయోగపడేలా ప్రభుత్వం రూపొందించింది. దీంతో ఒకే కార్డు ద్వారా పలు రకాల ప్రయోజనాలు పొందవచ్చు. లబ్ధిదారుడు దుకాణానికి వెళ్లి డీలరుకు కార్డు ఇస్తే తన వద్ద ఉన్న ఈపాస్ యంత్రంలో స్కాన్ చేస్తారు. అందులో లబ్ధిదారుల వివరాలతో పాటు ఇప్పటివరకు తీసుకున్న, తీసుకోవాల్సిన రేషన్ సరకుల వివరాలు ఉంటాయి. కార్డు ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత మరింత పెరుగుతుంది.


# లీకేజీలకు ఇక బ్రేక్




**న్యూస్ డెస్క్, 26 జూలై (ఇది కద నిజం ):** ద్యార్థుల చేపట్టిన ఆందోళనలు కుదిపేశాయి. అయితే, తాజాగా కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో విద్యార్థులతో కిక్కిరిసిన జంతర్ మంతర్ ఖాళీ అయింది. ఈ క్రమంలోనే లోక్‌సభ, రాజ్యసభ కార్యకలాపాలు యథావిధిగా సాగే అవకాశం కనిపిస్తోంది. ఇక నిలిచిపోయిన తమ కీలక శాసన ఎజెండాను వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగానే భవిష్యత్తులో పోటీ పరీక్షల్లో పేపర్ లీకేజీలకు చెక్ పెట్టేందుకు 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు, 2026'ను కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సభ ముందుకు తీసుకురాబోతున్నట్లుగా తెలుస్తోంది.

అయితే, ఈ సవరణ బిల్లులో మొత్తం ఏడు కీలక మార్పులను ప్రతిపాదించారు. కేసుల విచారణ కోసం ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు, ఛార్జ్‌షీట్ దాఖలైన మూడు నెలల్లోగా విచారణ పూర్తి చేయడం, 2 నెలల్లోనే దర్యాప్తు ముగించాలనే నిబంధనలను చేర్చారు. ముఖ్యంగా పేపర్ లీకేజీలకు పాల్పడే ముఠాలు, కోచింగ్ సెంటర్లు, సర్వీస్ ప్రొవైడర్లపై కఠిన జైలు శిక్షలతో పాటు భారీ స్థాయిలో ఆర్థిక జరిమానాలు విధించేలా నిబంధనలను పొందుపరిచారు. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ బిల్లుతో పాటు ఆదాయ పన్ను సవరణ బిల్లు, ఎంఎస్ఎంఈ అభివృద్ధి సవరణ బిల్లు, జనన-మరణాల నమోదు సవరణ బిల్లు వంటి పలు ఇతర ముసాయిదాలను కూడా ప్రభుత్వం ఈ వర్షాకాల సమావేశాల్లో ఆమోదింపజేసుకోవాలని భావిస్తోంది.

# మావోయిస్టు పోస్టర్లతో కలకలం



**న్యూస్ డెస్క్, 26 జూలై (ఇది కద నిజం ):** కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న మహారాష్ట్రలోని గడ్చిరోలి ఏజెన్సీ ప్రాంతంలో మళ్లీ మావోయిస్టుల కదలికలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. జిల్లాలోని భామ్రాగడ్ తాలూకా పరిధిలోని పలు ప్రధాన రహదారులు, ప్రభుత్వ భవనాల వద్ద మావోయిస్టులు వేసిన పోస్టర్లు ప్రత్యక్షం కావడంతో స్థానిక ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ఆదివాసీల 'జల్, జంగల్, జమీన్' హక్కుల పరిరక్షణ, పలు స్థానిక సమస్యలపై నిరసనగా మావోయిస్టుల ఉత్తర గడ్చిరోలి డివిజన్ కమిటీ ఈ పోస్టర్లను విడుదల చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ జూలై 30 వరకు గడ్చిరోలి జిల్లా వ్యాప్తంగా బంద్ పాటించాలని ప్రజలకు, వ్యాపారులకు పిలుపునిచ్చారు. అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని రవాణా, వ్యాపార సముదాయాలు మూసివేయాలని ఆ పోస్టర్లలో పేర్కొన్నారు.

భద్రతా దళాలు అలర్ట్.. కూంబింగ్ తీవ్రతరం

అయితే, మావోయిస్టుల బంద్ పిలుపు, పోస్టర్ల లభ్యంపై స్పందించిన గడ్చిరోలి పోలీసులు, సీ-60 కమాండో దళాలు తక్షణమే రంగంలోకి దిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఎలాంటి దాడులకు తావులేకుండా ఉండేందుకు సరిహద్దు ప్రాంతాల్లో అదనపు భద్రతా బలగాలను మోహరించారు. భామ్రాగడ్, ఏటపల్లి, అహేరి అటవీ ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా దళాలు విస్తృతంగా కూంబింగ్ చర్యలు చేపట్టాయి. బంద్‌కు సంబంధించి ప్రజలు ఎలాంటి పుకార్లను నమ్మవద్దని, భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ఏజెన్సీ ప్రాంతంలో పరిస్థితి పూర్తి పోలీసుల నియంత్రణలోనే ఉందని ఉన్నతాధికారులు వెల్లడించారు. సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలను మరింత కఠినతరం చేశారు.

# పేపర్ లీక్‌లపై రాజకీయ రచ్చ

మొదటి పేజీ తరువాయి

పంజాబ్ విద్యాశాఖ మంత్రి హర్జోత్ సింగ్ బైన్స్ రాజీనామాను ఎప్పుడు కోరతారు?" అని ప్రశ్నించారు. పంజాబ్‌లో గడిచిన కొద్దికాలంలో పలు కీలక పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని ఆయన ఆరోపించారు. పంజాబ్ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డ్ 12వ తరగతి ఇంగ్లీష్ పరీక్ష, పంజాబ్ స్టేట్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్, అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పరీక్ష, పంజాబ్ సబోర్డినేట్ సర్వీసెస్ సెలెక్షన్ బోర్డ్ గ్రూప్-బి, కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ పరీక్షలలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. అలాగే నైబ్ తహసీల్దార్, ఫార్మసీ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ పరీక్షలలో భారీ ఎత్తున కాపీయింగ్ జరిగిందన్నారు. ఎక్సైజ్ అండ్ ట్యాక్సేషన్ ఇన్స్పెక్షన్ మెరిట్ జాబితాలో నకిలీ పేర్ల నమోదు చేశారని ఆరోపణలు చేశారు.

కాంగ్రెస్ విమర్శలు

ఈ వ్యవహారంలో పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా కూడా ఆప్‌పై విరుచుకుపడ్డారు. "గత నాలుగేళ్లలో పంజాబ్‌లో 6 ప్రధాన పేపర్ లీకేజీలు జరిగాయి. ఎంతోమంది విద్యార్థుల కలలు కల్లలయ్యాయి. కానీ ప్రభుత్వం నుండి ఎలాంటి జవాబుదారీతనం లేదు. పంజాబ్ విద్యాశాఖ మంత్రి హర్జోత్ బైన్స్ ఎప్పుడు రాజీనామా చేస్తారు? పంజాబ్ విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు మరియు జవాబుదారీతనం అవసరం" అని ఆయన అభిప్రాయపడ్డారు.

# షర్మిలకు సర్జరీ.. ఆరోగ్యంపై క్లారిటీ



**న్యూస్ డెస్క్, 26 జూలై (ఇది కద నిజం ):** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆసుపత్రి బెడ్‌పై చికిత్స పొందుతున్న ఆమె ఫొటో ఒకటి సోషల్ మీడియా లో వైరల్ కావడంతో ఆమె ఆరోగ్య పరిస్థితిపై పార్టీ శ్రేణుల్లో, ప్రజల్లో ఆందోళన వ్యక్తమైంది. ఈ ఊహాగానాలకు తెరదించుతూ తన ఆరోగ్య పరిస్థితిపై షర్మిల స్వయంగా 'ఎక్స్' వేదికగా స్పష్టత ఇచ్చారు. తనకు పొత్తికడుపుకు సంబంధించిన ఒక సాధారణ ఆపరేషన్ జరిగిందని, ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్నానని తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక పోస్ట్ చేస్తూ.. 'ఇటీవల నాకు పొత్తికడుపు ఆపరేషన్ జరిగింది. ప్రస్తుతం నేను బాగున్నా. చాలా వేగంగా కోలుకుంటున్నాను. ఈ విషయాన్ని మీ అందరితో పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ సమయంలో నా కోసం ప్రార్థనలు చేసిన వారికి ధైర్యం చెప్పిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మీ ప్రేమ, ఆదరణ, ఆశీస్సులు నాకు ఎంతో బలాన్నిచ్చాయి' అని పేర్కొన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె భరోసా ఇచ్చారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి షర్మిల రాష్ట్ర రాజకీయాల్లో చాలా చురుగ్గా ఉంటున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలపై విమర్శలు చేస్తూ తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. అయితే గత కొంతకాలంగా ఆమె ప్రత్యక్ష రాజకీయ కార్యక్రమాల్లో కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా 'నీట్' పేపర్ లీక్ వ్యవహారంపై నిరసనలు జరుగుతున్న సమయంలో ఆమె గైర్హాజరుపై పలువురు ప్రశ్నించారు. అయితే ఆ సమయంలో ఆమె ట్విట్టర్ ద్వారా స్పందిస్తూనే ఉన్నారు. తాజాగా ఆమెకు సర్జరీ జరగడమే ఈ విరామానికి కారణమని స్పష్టమైంది. షర్మిల ఏపీ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన తర్వాత పార్టీకి కొత్త ఉత్సాహం వచ్చిందని, కార్యకర్తల్లో జోష్ పెరిగిందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఆమె కోలుకుంటున్నారని, త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి, రాజకీయ కార్యక్రమాల్లోకి వస్తారని పార్టీ వర్గాలు, అభిమానులు ఆశిస్తున్నారు.

# డీఎస్సీపై రాజకీయ దుమారం



**న్యూస్ డెస్క్, 26 జూలై (ఇది కద నిజం):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డీఎస్సీ నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే ఈ పరీక్షల్లో అక్రమాలు జరిగాయని తొలి నుంచి వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు ఏకంగా మంత్రి రాజీనామాకు డిమాండ్ చేస్తున్నారు. మాజీ మంత్రి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అయితే డీఎస్సీలో ఒక్కో పోస్టును మంత్రి నారా లోకేశ్ రూ. 30 లక్షలకు అమ్మేశారని ఆరోపించారు. తిరుపతి లో ఆయన మీడియాతో మాట్లాడుతూ డీఎస్సీ లో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేశ్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ తరహాలోనే డీఎస్సీలోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. స్పోర్ట్ కోటా ఉద్యోగాలను అమ్ముకున్నారని వ్యాఖ్యానించారు. విద్యాశాఖను లోకేశ్ అవినీతిమయం చేశారని మండిపడ్డారు. ఈ విషయంపై కలెక్టరేట్ల వద్ద ఆందోళన నిర్వహిస్తామని భూమన హెచ్చరించారు.

# విద్యాశాఖ పగ్గాలు ప్రహ్లాద్ జోషికి



**న్యూస్ డెస్క్, 26 జూలై (ఇది కద నిజం):** కేంద్ర మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం హస్తినలో రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. తాజాగా, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆదివారం మధ్యాహ్నం విద్యాశాఖ మంత్రి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ప్రధాని నరేంద్ర మోదీ సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రహ్లాద్ జోషికి విద్యా మంత్రిత్వ శాఖ అదనపు బాధ్యతలను అప్పగించిన విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతం ఆయన వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖలతో పాటు నూతన, పునరుద్ధరణీయ ఇంధన శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇకపై వాటితో పాటు విద్యాశాఖను కూడా ఆయనే స్వయంగా పర్యవేక్షించనున్నారు. అదనపు బాధ్యతలు చేపట్టిన అనంతరం విద్యా వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు వేగవంతం చేయడం, పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత తీసుకురావడమే తమ ప్రాధాన్యత అని ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు.

# ఆర్టీసీ కార్మికుల ఉద్యమం ఉధృతం... నేడు రాష్ట్ర వ్యాప్తంగా....!

మొదటి పేజీ తరువాయి

ఇందులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయనున్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని, సంస్థ ఆధ్వర్యంలోనే విద్యుత్ బస్సులను కొనుగోలు చేసి నడపాలని డిమాండ్ చేయనున్నారు. కలెక్టర్ల ద్వారా ఈ వినతిపత్రాలను సీఎం చంద్రబాబుకు చేరవేయనున్నారు.

కాగా ఆర్టీసీ ప్రైవేటీకరణను విరమించుకోవాలని ఇప్పటికే భారీగా సంతకాల సేకరణ చేశారు. లీజు బస్సులు, ప్రైవేట్ ఈ-బస్సులతో ప్రజలు, ఉద్యోగులకు జరిగే నష్టాలను వివరిస్తూ పోరాటాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఉద్యమ తదుపరి భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేసేందుకు జులై 30న ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ అత్యవసరంగా సమావేశం కానుంది. ఈ భేటీ అనంతరం కీలక నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని పలువురు ఆర్టీసీ కార్మికులు అంటున్నారు.

# 21కే పార్లమెంట్ దారి?

మొదటి పేజీ తరువాయి

ఇండియా కూటమి నేతలను కలుస్తా:

వచ్చే ఆగస్టులో తెలంగాణ రాష్ట్ర శాసనసభలో దీనిపై ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టబోతున్నట్లు సీఎం తెలిపారు. తద్వారా ఈ అంశం పార్లమెట్ లో చర్చకు వస్తుందన్నారు. తొలుత తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి ఆ తర్వాత మా పార్టీ నాయకులు ఖర్గే, రాహుల్ తో సమావేశమై ఈ ప్రతిపాదనను వారి ముందు ఉంచుతానన్నారు. ఆ తర్వాత 'ఇండియా' కూటమిలోని అన్ని పార్టీల నాయకులను కూడా కలవాలనుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం ఈ విషయంలో ముందడుగు ఎలా పడుతుందో చూద్దామన్నారు.

బెదిరించడం మోడీకి అలవాటుగా మారింది:

విపక్షాలు లేవనెత్తే ఏ అంశాన్నైనా బెదిరింపులకు దిగడం, కేసులు పెట్టడం ద్వారా తొక్కిపెట్టడం ప్రధాని మోడీకి అలవాటుగా మారిందని సీఎం విమర్శించారు. ఈసారి మోడీ ఈడీ, సీబీఐ లను ఉపయోగించి ప్రతిపక్షాలను భయపెట్టడానికి ప్రయత్నించారు. పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, మహారాష్ట్రలలో రాజకీయ పార్టీలను చీల్చడం ద్వారా ప్రతిపక్షాలను బలహీనపరిచాలని కూడా చూశారు. కానీ ఈసారి దేశంలోని యువత అంతా రోడ్లపైకి వచ్చారు. వీధుల నుండి పార్లమెంట్ వరకు యువత పోరాడి మోడీని ఓడించారన్నారు. రైతులు, యువత స్పందించి తిరిగి పోరాటం ప్రారంభించినప్పుడు ఎంతటి ప్రభుత్వమైనా ఓటమిని అంగీకరించాల్సిందేనని నిన్న మోడీ అలాంటి ఓటమే ఎదుర్కొన్నారన్నారు.

సీఎం వ్యాఖ్యలపై బీజేపీ ఎటాక్:

జెన్ జీ యువత రోడ్లపై పోరాటాలకు పరిమితం కాకుండా చట్టసభల్లోనూ వారికి ప్రాతినిధ్యం కల్పించేందుకు 21 సంవత్సరాలకే లోక్ సభ సభ్యునిగా, ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించేలా శాసనసభలో తీర్మానం చేసిన కేంద్రానికి పంపుతామన్న సీఎం వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. 'జెన్ జీ'కి రేవంత్ రెడ్డి అంత ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటే తన పార్టీలో ఓ యువ ఎమ్మెల్యేకు విద్యాశాఖను ఇవ్వాలని అన్నారు. చేతనైతే జీహెచ్ఎంసీకి 'జెన్ జీ' మేయర్‌ను చేయండి అంటూ సవాల్ విసిరారు. రాజ్యాంగ నిర్మాతలు నిర్ణయించి వయో పరిమితిపై చర్చించాల్సి వస్తే తప్పకుండా పార్లమెంట్ సరైన వేదిక అని రఘునందన్ రావు అన్నారు.

# సీఎం క్రెడిట్‌పై కవిత ఫైర్

**న్యూస్ డెస్క్, 26 జూలై (ఇది కద నిజం):** 36 రోజులపాటు ఉద్యమం చేసి కేంద్రం దిగి వచ్చేలా విద్యార్థులు చేశారని.. తప్పనిసరి పరిస్థితుల్లో కేంద్రమంత్రి రాజీనామా చేయాల్సిన స్థితి తెచ్చారని.. ఈ విజయాన్ని తమ ఖాతాలో వేసుకోవటానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నించటం సిగ్గుచేటని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఇది వెయ్యి శాతం విద్యార్థులు సాధించిన ఘన విజయమని పేర్కొన్నారు. విద్యార్థుల ఘనతను తాము సాధించినట్లు నాలుగు గంటలపాటు నగర వీధుల్లో సీఎం సహా కాంగ్రెస్ నాయకులు ఊరేగింపు చేశారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఫెయిల్యూర్స్‌ను విద్యార్థులు ఎక్కడ నిలదీస్తారోనని ముందుగానే సీఎం బయటకు వచ్చి ఊరేగింపులు చేశారని ఆరోపించారు. విద్యార్థులు, యూత్‌ను పట్టించుకోని సీఎం.. 21 ఏళ్లకే యువత పార్లమెంట్‌లో ఉండేలా బిల్లు తెస్తామని చెబుతున్నారని తెలిపారు. 21 ఏళ్లకే పార్లమెంట్‌లో యువతకు అవకాశం కల్పించాలన్న జ్ఞానోదయం కలగటం సంతోషమే అయినప్పటికీ యువతకు ఇస్తామన్న 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, ఫీజు రీయింబర్స్‌మెంట్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అందుకే మిమ్మల్ని యువత నమ్మే అవకాశం లేదని తెలిపారు. అసెంబ్లీలో ఏ బిల్లు పెట్టినా కేంద్రం వద్ద ఆ బిల్లు పాస్ కాకుండా లాలూచీ పడుతున్నారని.. ఆ విషయం బీసీలకు, తెలంగాణ ప్రజలకు బాగా తెలుసని పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి అట్టహాసంగా వెయ్యి కోట్లు ఇస్తామని చెప్పి ఒక్క రూపాయి ఇవ్వలేదని ఆరోపించారు. కొవ్వొత్తులు పట్టుకొని ఉరేగితే విద్యార్థులు నమ్మరని.. మీ చరిత్ర అందరికీ తెలుసని పేర్కొన్నారు. ఇకనైనా యువతకు, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఇదే యువత గద్దె దించుతారని హెచ్చరించారు.

# బీసీల ఐక్యతే సమాజ ప్రగతికి బలమైన పునాది

## రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ రంగరాజన్

### నవాబ్ పేట్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ రంగరాజన్ ఘన సన్మానం

ఇది కద నిజం,నవాబుపేట్ :బీసీ వర్గాల ఐక్యతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని, సామాజిక న్యాయం, ఆర్థిక పురోగతికి ఐక్యతే బలమైన పునాదిగా నిలుస్తుందని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు కే. రంగరాజన్ ముదిరాజ్ అన్నారు.ఆదివారం నవాబ్ పేట్ మండల కేంద్రంలోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్ లో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు రాఘవేంద్రర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ నెంబర్ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ముందుగా రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు కే. రంగరాజన్ ముదిరాజ్ ను మండలాధ్యక్షులు తెలుగు రాఘవేందర్ ముదిరాజ్,ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ ముదిరాజ్,సర్పంచులు ఘనంగా పూలమాలవేసి శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ రంగరాజన్ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి హక్కులు,సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తోందన్నారు.ముదిరాజ్ లు ఐక్యంగా ఉంటేనే హక్కుల సాధనతో పాటు మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.ముదిరాజ్‌లకు ప్రభుత్వ పరంగా అందుతున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తామని చెప్పారు.విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ యువత అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు.సమాజ అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ సంఘటితంగా పనిచేయాలని, ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం బీసీల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.సమాజంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారం,వారి సంక్షేమం కోసం తన వంతు కృషి కొనసాగిస్తానని రంగరాజన్ ముదిరాజ్ హామీ ఇచ్చారు.గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం కావడానికి మౌలిక వసతుల కల్పనకు గ్రామాలను సందర్శించి పూర్తి నివేదిక రూపొందించి నిధులను మంజూరు అయ్యేలా చూస్తామని అన్నారు.బీసీ వర్గాలకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు యాదగిరి యాదవ్, కౌన్సిలర్ మల్లికార్జున్ గౌడ్,ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు రాఘవేందర్ ముదిరాజ్,ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ ముదిరాజ్,సర్పంచులు దుర్గయ్య ముదిరాజ్,



శ్రీనివాస్ ముదిరాజ్,అనిత ఆంజనేయులు ముదిరాజ్,ముదిరాజ్ సంఘం నాయకులు,బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అత్తాపూర్ డివిజన్‌లో ఘనంగా ప్రధాని నరేంద్ర మోడీ 'మన్ కీ బాత్' వీక్షణ

**ఆగస్టు 8 నుంచి తిరంగా యాత్ర నిర్వహణకు పిలుపు**

ఇది కద నిజం,అత్తాపూర్

గౌరవ భారత ప్రధాని నరేంద్ర మోడీ నిర్వహించిన 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం హైదర్గూడా అత్తాపూర్ డివిజన్ బూత్ నంబర్ 218 పరిధిలోని డివిజన్ సెక్రెటరీ శివరాజ్ గౌడ్ నివాసంలో ఘనంగా వీక్షించారు. డివిజన్ అధ్యక్షులు సులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు అంజన్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశభక్తిని చాటేలా వచ్చే ఆగస్టు 8వ తేదీ నుండి ప్రతి ఒక్కరూ 'తిరంగా యాత్ర' నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కొమురయ్య, జిల్లా కార్యదర్శి మల్లేష్ యాదవ్, రాజశేఖర్, జయానంద్ రెడ్డి, నల్లింగ్ రమేష్, శివరాజ్ గౌడ్, కమలేకర్ రాజు, నాగేష్ యాదవ్, మేడం రాము, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణలకు వేగం పెంచాలి

### అర్హులందరూ పేర్లు నమోదు చేసుకుని సవరణలు పూర్తి చేసుకోవాలి

ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు



పిట్లం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) సమీక్ష సమావేశంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పాల్గొన్నారు. నూతన ఓటర్ల నమోదు, ఓటరు జాబితా సవరణల పురోగతిపై అధికారులతో, పార్టీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకుని, అవసరమైన సవరణలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఓటు హక్కును ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకునేలా ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, పిట్లం గ్రామ సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రామ్ రెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీ బీఎల్ఏలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మెరుగైన రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



మౌలిక వసతుల కల్పనతో పాటు నాణ్యమైన రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం రాజాపేట మండలంలోని మొల్లగూడెం-కాశగూడెం బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో నాణ్యమైన రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం ద్వారా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించడంతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలందరికీ ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని ఆయన అన్నారు. ప్రతి గ్రామంలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లగూడెం గ్రామ సర్పంచ్ జెన్నెపల్లి బాలరాజ్ రెడ్డి, ఉపసర్పంచ్ రెడ్డబోయిన కవిత, వార్డు సభ్యులు నీల కనకమ్మ, గొడుగు బ్రహ్మయ్య, నీల జహంగీర్, గొడుగు కల్పన, బోయిని నాగరాజు, ఎంపీడీవో నాగవేణి, ఆర్ఐ నర్సింలు, రేనీకుంట పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగి పెంటయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఇంజా నరేష్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రంగ నరేష్ గౌడ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెవుల లింగం, రేగు సిద్ధులు, రాజాపేట ఉపసర్పంచ్ నమిల కేదారి గౌడ్, బల్ల మహేష్, పంచాయతీ కార్యదర్శి, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రాంత విభేదాలు లేకుండా కడుపులో పెట్టుకుంటాం : ఎమ్మెల్యే

మినీ ఇండియాగా పేరు ఉన్న పటాన్ చెరు నియోజకవర్గంలో స్థిరపడ్డ పలు రాష్ట్రాల ప్రజలను కులం, మతం, ప్రాంతం విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరిని కడుపులో పెట్టుకొని చూసుకుంటామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో నియోజకవర్గలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ పేర్లను నమోదు చేసుకోని, పటాన్ చెరుని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపడంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఆదివారం పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఓటర్లు, కార్మికులకు ఎస్ఐఆర్ అంశం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు.



ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఓటు హక్కు ఉండడం అత్యంత అవసరమని అన్నారు. ఓటు ఉన్నప్పుడే ప్రజల సమస్యలు ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో పాటు.. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. అందుకని నియోజకవర్గ పరిధిలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. పటాన్ చెరు భవిష్యత్తుకు ప్రతి ఓటు అత్యంత కీలకమని అన్నారు. అన్ని రాష్ట్రాల ప్రజల పండుగలను, పర్వదినాలను కలిసిమెలిసి నిర్వహిస్తూ ఈ ప్రాంతాన్ని భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుపుతున్నామని తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు ఎస్ఐఆర్ అంశం పై అవగాహన కల్పించారు. ఇటీవల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నాయికోటి రాజును ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శంకర్ యాదవ్, గూడెం మధుసూదన్ రెడ్డి, యాదగిరి యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, బాల్ రెడ్డి, దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అంతిరెడ్డి, రామచంద్ర రెడ్డి, నర్రా బిక్షపతి, పృథ్వీరాజ్, వివిధ రాష్ట్రాల ప్రజలు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రెండు రాష్ట్రాల కాంగ్రెస్ వైఖరితో రైతులు నష్టపోతున్నారు

కర్ణాటక, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాలు కలిసి తెలంగాణ రైతాంగానికి తీవ్ర అన్యాయం చేస్తున్నాయని బీఆర్ఎస్ మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆవేదన



వ్యక్తంచేశారు. ఆదివారం కర్ణాటక రాష్ట్రంలోని గూడూరు గ్రామం వద్ద భీమా నదిపై నిర్మించిన రివర్ బ్రిడ్జి ను, కృష్ణ నదిపై గూగల్ ప్రాంతంలోని బ్రిడ్జి ని బీఆర్ఎస్ మాజీమంత్రులు వి.శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్. రాజేందర్ రెడ్డి, అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి లు సందర్శించిన సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. కర్ణాటక వైపు ఉన్న ప్రాజెక్టుల్లో నీళ్లు ఉంటే, తెలంగాణ వైపు ఉన్న ప్రాజెక్టుల్లో చుక్క నీరు లేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. మహబూబ్ నగర్ ను ఎడారిగా మార్చేందుకు పక్క రాష్ట్రాలు ప్రయత్నం చేస్తున్నాయని, తుంగభద్ర నీరు రాకుండా ఆర్డీఎస్ వద్ద కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ అక్రమంగా ప్రాజెక్టులు నిర్మాణం చేస్తూ శ్రీశైలం కు నీరు రాకుండా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పాలమూరు ప్రాజెక్టు 10 శాతం పనులు పూర్తి చేస్తే రిజర్వాయర్లు నింపుకునేందుకు అవకాశం ఉండేదని, లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన అన్నారు. గుండ్రేవుల నుంచి నీరు తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ కుట్ర చేస్తుందని, కర్ణాటక కూడా అక్రమ ప్రాజెక్టులు, బ్యారేజీలు, చెక్ డ్యామ్ లు కడుతూ పై నుంచి నీరు రాకుండా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. ఆల్మట్టి డ్యాం 300 టీఎంసీ నీటి సామర్థ్యం పెంచేందుకు పనులు జరుగుతున్నాయని, ఇప్పటికే భూ సేకరణ ప్రారంభించారని, భీమా నది కే నేరుగా హైడ్రాలిక్ గేట్లు పెట్టారని, వర్షాకాలం కూడా నీళ్లు రాకుండా చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.


# సినిమా న్యూస్

## మెగా-158 నుంచి బర్త్‌డే ట్రీట్



మెగాస్టార్ చిరంజీవి వరుస భారీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ అభిమానులను అలరించడంతో పాటు యంగ్ హీరోలకు పోటీగా నిలుస్తున్నారు. ఆయన హీరోగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'విశ్వంభర' విడుదల కాకముందే.. టాలెంటెడ్ డైరెక్టర్ బాబీ కొల్లి దర్శకత్వంలో మరో భారీ చిత్రాన్ని లైన్‌లో పెట్టిన సంగతి తెలిసిందే. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లతో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. మళ్లీ వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ గ్యాంగ్‌స్టర్ మూవీపై భారీ అంచనాలు భారీగా నెలకొన్నాయి. 'మెగా-158' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అత్యంత ఘనంగా నిర్మిస్తున్నారు.

యాక్షన్ అండ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రంలో కోలీవుడ్ సీనియర్ నటుడు శరత్ కుమార్ విలన్‌గా నటిస్తుండగా, కమెడియన్ డాక్టర్ భద్రం కీలక పాత్రలో కనిపించబోతున్నారు. అయితే ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే శరవేగంగా జరుగుతున్నప్పటికీ, మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక పోస్టర్ లేదా అప్‌డేట్ రాలేదు. దీంతో ఈ క్రేజీ ప్రాజెక్ట్ నుంచి అప్‌డేట్స్ ఎప్పుడెప్పుడు వస్తాయా అని మెగా అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో మెగా ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించే ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. వచ్చే నెల ఆగస్ట్ 22న మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భం గా ఈ సినిమాకు సంబంధించిన ఒక పవర్ ఫుల్ గ్లింప్స్‌ను విడుదల చేయడానికి చిత్ర బృందం ప్లాన్ చేస్తోందని టాక్.



## 'వారణాసి'లో మరో హీరోయిన్!

ప్రిన్స్ మహేష్ బాబు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కృష్ణ వారసత్వాన్ని అందుకొని ఇండస్ట్రీలో అడుగుపెట్టిన మహేష్ బాబు... తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. వయసు పైబడినప్పటికీ కూడా కుర్ర హీరోలతో పోటీ పడుతున్నారు. అలాంటి మహేష్ బాబు ప్రస్తుతం జక్కన్న దర్శకత్వంలో వారణాసి సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. ఈ సినిమాలో మహేష్ బాబు హీరోగా చేస్తుండగా... ప్రియాంక చోప్రా స్పెషల్ రోల్ చేస్తున్నారు. అయితే ఈ సినిమా నుంచి తాజాగా ఓ కీలక అప్డేట్ వైరల్ గా మారింది. ఈ మూవీలో మరో హీరోయిన్ నటించబోతున్నట్లు తెలుస్తోంది. తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన మరో భామను జక్కన్న తీసుకున్నారట. ఆమె ఇందులో ఒక గెస్ట్ రోల్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై ప్రిన్స్ మహేష్ బాబు బర్త్డే సందర్భంగా అప్డేట్ ఇస్తారని తెలుస్తోంది. కాగా ఈ సినిమా వచ్చే ఏడాది రిలీజ్ కానుంది.

## ట్విస్టులతో ఆకట్టుకున్న ట్రైలర్ 'న్యూటన్స్ థర్డ్ లా' ట్రైలర్





అక్కినేని హీరో సుమంత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'న్యూటన్స్ థర్డ్ లా'. ఇందులో సీనియర్ నటుడు జగపతి బాబు కీలక పాత్రలో కనిపించబోతున్నారు. క్రైమ్, ఇన్వెస్టిగేషన్, సస్పెన్స్, ఫ్యామిలీ ఎమోషన్స్ అన్నీ కలిసిన ఈ చిత్రం జూలై 31న థియేటర్స్'లోకి రాబోతుంది. తాజాగా, మూవీ మేకర్స్ ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో సుమంత్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించారు. ఒక అనుమానాస్పద హత్య కేసును ఆయన విచారిస్తుండటం, జగపతి బాబు విలన్ షేడ్స్ ఉన్న పాత్రలో ఆశ్చర్యపరచడం ఆకట్టుకున్నాయి. అద్భుతమైన ట్విస్టులతో సాగిన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఇక ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో సుమంత్ మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

గత పదేళ్లలో తాను ఒక్కసారి కథ వినగానే ఒకే చెప్పిన సినిమాలు రెండే రెండు ఉన్నాయని, అందులో ఒకటి 'మళ్లీ రావా' అయితే, రెండోది ఈ 'న్యూటన్స్ థర్డ్ లా' అని వెల్లడించారు. 'అనగనగా' సినిమా కంటే ముందే డైరెక్టర్ తనకు ఈ కథ చెప్పారని గుర్తుచేసుకున్నారు. ఈ సినిమాలో తన పాత్ర కంటే కూడా కథను నడిపించే స్క్రీన్‌ప్లేనే అసలైన హీరో అని సుమంత్ ప్రశంసించారు. బయటకు థ్రిల్లర్‌లా కనిపించినా, ఇందులో ఎంతో లోతైన ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్నాయని చెప్పారు. చాలామంది టైటిల్ మార్చమని చెప్పినప్పటికీ, కథకు ఇదే సరైన పేరని తాను పట్టుబట్టి ఉంచినట్లు తెలిపారు. ట్రైలర్‌లో చూపించింది చాలా తక్కువేనని, థియేటర్లలో ప్రేక్షకులకు మరెన్నో సస్పెన్స్ ఎలిమెంట్స్ ఎదురవుతాయని ఆయన పేర్కొన్నారు.

## నటుడికి మెగాస్టార్ అండ

ఎంతోమంది అభిమానుల కష్టాల్లో అండగా నిలుస్తున్న మెగాస్టార్ చిరంజీవి మరోసారి గొప్ప మనసు చాటుకున్నారు. 'గబ్బర్ సింగ్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు రమేశ్ ఇటీవల తీవ్రమైన బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ప్రస్తుతం అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే చిరంజీవి స్పందించారు. ఆసుపత్రి వర్గాలతో మాట్లాడిన మెగాస్టార్, వైద్యుడు డాక్టర్ సుబ్బారెడ్డిని అడిగి రమేష్ ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. మెరుగైన చికిత్స అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అనంతరం రమేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన చిరంజీవి, ఆస్పత్రి ఖర్చులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు తన వంతుగా రూ. 3 లక్షల ఆర్థిక సాయం అందించారు. అంతటితో ఆగకుండా, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం ద్వారా రమేశ్ వైద్యానికి తగిన సహాయం అందేలా ప్రభుత్వంతో మాట్లాడి సిఫార్సు చేస్తానని ఆయన కుటుంబానికి హామీ ఇచ్చారు. ఇక చిరంజీవి తమ్ముడు, నటుడు నాగబాబు కూడా రమేశ్ కుటుంబానికి అండగా నిలుస్తూ రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. కష్టసమయంలో తోటి నటుడిని ఆదుకోవడానికి మెగా బ్రదర్స్ ముందుకు రావడం పట్ల మెగా అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో, మెగాస్టార్ చిరంజీవి గొప్ప మనసును కొనియాడుతూ నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.



## సూపర్‌స్టార్ బయోపిక్ ప్లాన్?

ఒక సాధారణ బస్ కండక్టర్‌గా జీవితాన్ని ప్రారంభించి, సూపర్‌స్టార్‌గా ఎదిగిన రజనీకాంత్ ప్రయాణం కోట్లాది మందికి స్ఫూర్తి. ఆయన జీవితం గురించి ఎన్నో కథనాలు, పుస్తకాలు వచ్చినా, స్వయంగా రజనీకాంత్ రాసే ఆత్మకథ కోసం అభిమానులు చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఆ ఎదురుచూపులకు తెరపడే సమయం దగ్గరపడినట్టు కనిపిస్తోంది. అంతేకాదు, ఆ ఆత్మకథను సినిమాగా కూడా తీసుకురావాలనే ఆలోచన జరుగుతోందన్న వార్తలు కూడా ఇప్పుడు ఊపందుకుంటున్నాయి.

తాజా సమాచారం ప్రకారం, రజనీకాంత్ ప్రస్తుతం తన జీవితకథను స్వయంగా రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఆత్మకథలో ఆయన చిన్ననాటి లైఫ్ నుంచి సూపర్ స్టార్ గా ఎదిగిన ప్రయాణం వరకు ఎన్నో ఆసక్తికర సంఘటనలు చోటు చేసుకోనున్నాయి. సినీ జీవితంలో ఎదురైన సవాళ్లు, మరపురాని విజయాలు, వ్యక్తిగత అనుభవాలు, అభిమానులతో ఉన్న అనుబంధం వంటి అనేక విషయాలను ఇందులో పొందుపరచనున్నట్లు సమాచారం.



ఈ పుస్తకం రచనలో మాత్రమే ఆగిపోకుండా, దానిని వెండితెరపైకి తీసుకురావాలనే ఆలోచన కూడా రజనీకాంత్ చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఆయన తన అత్యంత సన్నిహితులతో చర్చలు జరుపుతున్నారని ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అయినప్పటికీ, రజనీకాంత్ జీవితగాథ సినిమాగా వస్తే అది భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మక బయోపిక్‌లలో ఒకటిగా నిలిచే అవకాశముందని అభిమానులు భావిస్తున్నారు.

ఇక సినిమాల పరంగా చూస్తే, రజనీకాంత్ ప్రస్తుతం భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న 'జైలర్ 2'లో నటిస్తున్నారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, సూరజ్ వెంజరమూడు, విద్యా బాలన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మొదటి భాగంలో కనిపించిన రమ్యకృష్ణన్, మీర్నా, యోగి బాబు తమ పాత్రలను కొనసాగిస్తున్నారు. అలాగే మోహన్‌లాల్, హృతిక్ రోషన్, శివ రాజ్‌కుమార్, విజయ్ సేతుపతి ప్రత్యేక పాత్రల్లో కనిపించే అవకాశముందని తెలుస్తోంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం 2026 అక్టోబర్ 15న విడుదల కానుంది.

అంతేకాకుండా, రజనీకాంత్ మరోసారి దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్‌తో చేతులు కలపనున్న ప్రాజెక్ట్ కూడా హాట్ టాపిక్ గా మారింది. ప్రస్తుతం 'ఖనఇ=ఖ రీయూనియన్' అనే తాత్కాలిక పేరుతో ప్రచారంలో ఉన్న ఈ మూవీలో కమల్ హాసన్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. చాలా సంవత్సరాల తర్వాత ఈ ఇద్దరు దిగ్గజాలు ఒకే తెరపై కనిపించే అవకాశం ఉండటంతో సినిమాపై భారీ హైప్ క్రియేట్ కాబోతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌కు మంచి స్పందన లభించగా, ఈ చిత్రానికీ అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు.

ఒకవైపు వరుస భారీ సినిమాలతో బిజీగా కొనసాగుతూనే, మరోవైపు తన జీవిత ప్రయాణాన్ని పుస్తకంగా అందించేందుకు రజనీకాంత్ సిద్ధమవుతున్నారన్న వార్త అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఆ ఆత్మకథ నిజంగానే సినిమాగా మారితే, అది కేవలం ఒక బయోపిక్ మాత్రమే కాదు, సాధారణ మనిషి అసాధారణ విజయగాథను ప్రపంచానికి మరోసారి పరిచయం చేసే చారిత్రాత్మక చిత్రంగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.